# నిజాయతి

రచన:
శ్రీ కె. వీరభద్రరావు

రాజమండ్రి వచ్చే బస్సు కోసం ఎదురుచూస్తూ నేను' నా స్నేహితుడు రమేష్ బస్సుస్టాండులో నిలబడ్డాం. వచ్చే పోయే బస్సులతో బస్సుస్టాండు ఎంతో రద్దీగా ఉంది. RTC బస్సుస్టాండు ఊరికి దూరంగా ఉండటంచేత RTC Depot కు వెళ్ళే బస్సులన్నీ మున్సిపల్ బస్సు స్టాండువద్ద ఆగి వెళ్తూ ఉంటాయి. సాధారణంగా ఊళ్ళో వాళ్ళు, ప్రక్కనున్న పల్లెటూర్లకు పోయేవాళ్ళు మున్సిపల్ బస్సుస్టాండుకు వచ్చి ఆయా ఊళ్ళకు పోయే బస్సులు ఎక్కి వెళ్ళిపోతూ వుంటారు. అందుచేత మున్సిపల్ బస్సుస్టాండులాగ సౌకర్యాలేమీ ఉండవు. కనీసం సూర్యుడి ధాటికి తట్టుకోవడానికి ఒక్క బస్సు షెల్టరుకూడ లేదు. ఆ రోజు ఆదివారం. సంత అవడం మూలాన్న మరింత రద్దీగా ఉంది. బస్సులు దిగేవాళ్ళు దిగుతున్నారు. ఎక్కేవాళ్ళు ఎక్కుతున్నారు. గర్భిణీ స్త్రీ లాగ అన్ని బస్సులూ క్రిక్కిరిసిన జనంతో ఉన్నాయి. ఎన్ని బస్సులొచ్చి జనం ఎక్కి వెళ్ళిపోయినా రద్దీ తగ్గలేదు. మేము బస్సుస్టాండుకు వచ్చి అపుడే అరగంట పైగా అయింది. ఒక్క బస్సుకూడ రాజమండ్రి నుంచి రాలేదు. కాళ్ళలో బలం సన్నగిల్లుతోంది. వేసవి కాలం అవటం వలన సాయంత్రం 4 గం॥లు అయినప్పటికీ ఎండ తీవ్రత తగ్గలేదు. బస్సుస్టాండుమ చూస్తూ ఉంటె వేరే నరకం ఏదీ వుండదు అనిపిస్తోంది. అడుక్కునే వాళ్ళ ఆర్త నాదాలు, మైకుల అరుపులు, బస్సుల హారన్లు, తల్లులచంకన నానా హైరానా పడిపోతూ ఎప్పుడు యింటికి వెళ్ళి ప్రక్క మీద శయనిద్దామా అని తపన పడుతున్న శిశువుల ఆర్త నాదాయీ, తినుబండారాలు అమ్ముకునే వాళ్ళ అరుపులు చాలా గందరగోళంగా ఉంది.

ఆ మధ్యకాలంలో పడిన వానల ధాటికి తట్టుకోలేక కుష్టువాని శరీరంలా అక్కడక్కడ కంకరరాళ్ళు బయటిక కనబడుతూ 'మా సంగతేమిటి' అని దారినపోయే ప్రతి వాహనాన్ని ప్రశ్నిస్తున్నాయా అన్నట్లు వాహనం వెళ్ళిన వెంటనే ఆకాశాన్ని అంటే ధూళిని మరల తనలో ఇము డ్చుకోకుండా ప్రయాణీకుల శరీరాలను పావనం చేసే 'మున్సిపల్ రోడ్డును' చూస్తుంటే కడుపులో దేవినట్లుగా ఉంది.

ఇంతలో కాకినాడ-వైజాగ్ బస్సు వచ్చింది. బస్సులో ఇంచుమించు ప్రయాణీకులందరూ దిగిపోయారు. ఒకతను తనకు 25 పై॥లు చిల్లరివ్వాలంటూ కండక్టరును అడిగాడు. కానీ చిల్లర లేదనేసరికి అతను విసుక్కుంటూ వెళ్ళి పోయాడు. నిజానికి కండక్టరు వద్ద చాలా చిల్లరుంది. ఒక ప్రయాణీకుడు బస్సు మీదనుంచి లగేజి దింపాడు. దానికి టిక్కట్టు తీస్తే 16 రూ॥ లు అవుతుందని కండక్టరు అనే సరికి ప్రయాణీకుడు ఆశ్చర్యం వెలిబుచ్చాడు. ఇంత చిన్న లగేజికి అంత డబ్బు తీసుకోవడం అన్యాయం అన్నాడు, అపుడు కండక్టరు 10 రూ॥లు తీసుకొని లగేజీ టిక్కెట్లు కోయడం మానేశాడు, అపుడా కండక్టరును చూస్తుంటే యీడ్చి తన్నాలనిపించింది.

ప్రభుత్వ వాహనం మోపిన లగేజీకి కావలసిన సొమ్మును ప్రభుత్వోద్యోగి తనే ఆ పని చేసినట్లుగా పాపం ప్రయాణీకుని సౌకర్యార్థం కొంత సొమ్మును తగ్గించి తన జేబులో వేసుకున్నాడు. ఎవడికి నష్టం? ఎవరికీ లేదు. ఇటు కండక్టరుకు డబ్బులు ఉత్తినే వచ్చాయి. నష్టపోయేది ప్రభుత్వం. అంటే ప్రజలు. ఇదేం ప్రజాస్వామ్యం। ప్రజాస్వామ్యాన్ని అర్థం చేసుకోలేని మూఢులు.

* * *

'ప్రజాస్వామ్యం' అనే సున్నితమైన పూల రథాన్ని తమ వికృతపాదాలతో నేల రాస్తున్న ప్రజాస్వామ్య పౌరులను ఏం చేయాలి? అసలు మన దేశానికి ప్రజాస్వామ్యం సరిపడదు. పాపం ఎంతో కష్టపడి సంపాదించిన స్వాతంత్ర్యాన్ని యీ విధంగా దుర్వినియోగ పరుస్తున్న అవినీతి పరులను, చీడపురుగులను ఏ విధంగా నాశనం చేయాలి? ఈ కాలంలో 'నిజాయితీ' అన్న పదానికి బొత్తిగా అర్థం తెలియకుండా పోయింది. కంచే చేనుమేస్తే దానికి పరిష్కార మేమిటి? నా మనస్సులో వేసుకున్న యిన్ని ప్రశ్నలు ఎప్పట్నుంచో ప్రశ్నలుగానే మిగిలి పోయాయి.

తలనొప్పి భరించలేక నేను, నా మిత్రుడూ దగ్గరగా నున్న కాఫీ హోటలుకు వెళ్ళి కాఫీ త్రాగాము. సిగరెట్టు కాల్చుకుంటూ ఉంటె కౌంటరువద్ద చిన్న తగాదా వినపడింది. ఏమిటా అని వెళ్ళిచూస్తే ఒక 20, 25 ఏళ్ళ యువకుడు హోటలు యజమానితో ఘర్షణ పడుతున్నాడు. హోటలు యజమాని కథనం ప్రకారం ఆ యువకుడు బిల్లు చెల్లించకుండా తప్పించుకు పోతున్నాడని, యువకుని కథనం ప్రకారం తాను సిగరెట్టు కొనడానికి పైకి వెళ్లాడని, అంతేగాని బిల్లు ఎగ్గొట్టే ఉద్దేశం తనకు లేదని, ఎవరో

అన్నట్లు 'దొరికితేనే దొంగ'. ఆ యువకుడ్ని చూసేవారెవరయినా ఎగ్గొట్టే రకం కాదని ఒప్పుకుంటారు. నాగరికత ముసుగులో దూరి యిట్లాంటి పనులను చేసే ఛండాలులకు బుద్ధి చెప్పేదెప్పుడు? అవినీతిని పారద్రోలే దెప్పుడు?

"ఇలాంటి వారిని నడిరోడ్డులో పెట్టి కాల్చేసినపుడు ఈ వ్యవస్థ మారుతుంది." నా మిత్రుడు రమేష్ వ్యాఖ్య.

ఒక వల్లెటూరుకి పోయే బస్సు కాబోలు వచ్చింది. 'రెండు గంటలకు రావలసిన బస్సు అయిదు గంటలకు వచ్చింది. ఎదవ బస్సులు!' ఒక నిరక్షరాస్యుడు RTC డిపార్ట్‌మెంట్‌ని దుమ్మెత్తి పోస్తున్నాడు. బస్సు చాలా ఆలస్యంగా రావడం మూలాన, జనం ఎక్కువగా ఉండడం మూలాన ఎవరి లగేజీలు వారు పట్టుకుని సీటు దొరుకుతుందో లేదోనని గాబరాగా బస్సులోనికి ఎక్కడానికి ప్రయత్నిస్తున్నారు.

ఇదే అదనుగా భావించి నిక్కరు, గళ్ళ బనియను వేసుకున్న వ్యక్తి ఒక ముసలివాని జేబులో కొంతసొమ్ము తీయడం నా కళ్ళారా చూశాను. రమేష్‌తో చెప్పాను. నిక్కరు, గళ్ళ బనియను జనాన్ని తప్పించుకుంటూ మా వైపే ఏమీ తెలియని వ్యక్తిలా వస్తున్నాడు. డబ్బులు పోగొట్టుకున్న ముసలాడు టిక్కెట్ తీసే ప్రయత్నంలో ఉన్నాడు. జేబుదొంగను పట్టుకున్నాము. తీసిన డబ్బులు మర్యాదగా యిచ్చేయమని హెచ్చరించేసరికి 50 రూ॥ల కాగితం తన సొంత సొమ్ము దానం చేస్తున్నట్లుగానే బాధపడుతూ యిచ్చేసి 'ఇది మాకు మామూలే అన్నట్లు'గా బస్సుస్టాండులో యింకో వైపుకు దారి తీసి, మళ్ళీ తన ప్రయత్నంలో వున్నాడు. ఆయాభై రూపాయలు ముసలివానికి యిచ్చివేశాము. ఇదేం పెద్దచిత్రం కానట్లు అక్కడ ప్రయాణీకులు మా వైపు ఒకసారి విచిత్రంగా చూసి వాళ్ళ పనుల్లో నిమగ్నమై పోయారు. ఆ ముసలాడు మటుకు మా వైపు కృతజ్ఞతా భావంతో చూశాడు. నాకు, రమేష్‌కు ఎంతో ఆనందం అనిపించింది - ఒక వ్యక్తికి న్యాయం చేకూర్చామని.

* * *

"NCC స్టూడెంట్సుకు అధికారమిచ్చి అదివారం రోజున ముఖ్యమైన సెంటర్సు వద్ద యిలాంటి జేబు దొంగల్ని పట్టుకునేట్లు చేస్తే జేబుదొంగలు మచ్చుకైనా కనబడరు." రమేష్ వ్యాఖ్య.

రమేష్ కూడా నాలాంటి ఆదర్శభావాలు గల వ్యక్తే. మా పరిచయం కొద్ది నెలలు మాత్రమే. రమేష్ భావాలు, గుణగణాలు సరిపడక పోతే నేను చచ్చినా Friend Ship చేయను. ఒకరికి 10 పైసలు అన్యాయం చేస్తే మనకు 10 రూ॥లు అన్యాయం కలుగుతుందని భావించే వారిలో నేనొకడ్ని, ఇతరుల్ని అన్యాయం చేసి బ్రతకడం కన్న చావటం మేలని నా వాదన. ఏ ఒక్కడూ ఎల్లపుడూ అందర్నీ మోసం చేయలేడు. మోసం చేసే ప్రతివాడు ఎపుడో ఒకపుడు (పాపం పండినపుడు) ఎవ్వరికో ఒకరికి దొరక్క మానడు. నా ఉద్దేశంలో యితరులకి అన్యాయం చేసేవాడి కంటే త్రాగుబోతు, వ్యభిచారి ఎంతో గొప్పవాడు.

బస్సుస్టాండులో నిలబడలేక కాళ్ళు నొప్పులు పెట్టాయి. ఇంతలో రాజమండ్రి నుంచి బస్సు వచ్చింది. కాని వస్తా నన్న మిత్రుడు రాలేదు. అందుకే తిరుగుముఖం పెట్టాను.

* * *

కాలచక్రం గిర్రున తిరిగింది. 10 స॥లు సునాయాసంగా గడచాయి. నేను B A పూర్తి చేసిన వెంటనే BEd అయి జిల్లా పరిషత్ స్కూలులో టీచరుగా పని చేస్తున్నాను. నా మిత్రుడు సబ్-యిన్‌స్పెక్టరుగా పని చేస్తున్నాడు. పండుగకు నేను మా అత్తవారింటికి వెళ్ళి తిరిగి వస్తూ ఉంటే బస్సుస్టాండులో రమేష్ కనబడి వాళ్ళింటికి రమ్మన్నాడు. ఈ పది సంవత్సరాల కాలంలో మేమిద్దరం కలుసుకోవడం యిదే మొదటిసారి. ఎన్నో చిన్ననాటి జ్ఞాపకాలు నా మదిలో మెదులుతున్నాయి. రమేష్ తన ఉద్యోగ నిర్వహణలో ఎంతో మందికి న్యాయం చేకూర్చుతున్నాడని నేనూహించుకుంటూ మా ఆవిడ పిల్లలతో రమేష్ యింటికి వెళ్ళాము. ఇల్లు చాలా బాగుంది. లక్షాధికారులు ఉండవలసిన యిల్లులా వుంది. అడిగితే యిల్లు స్వంతం అని చెప్పాడు. వాడికి ఒక్కడే కొడుకు. వాళ్ళావిడ 'మహిళా మండలి' అధ్యక్షురాలట. వాళ్ళావిడ నా భార్యతో పుట్టింటి గొప్పలు చెప్తోంది. నా మిత్రుని మాటలు చదువుకునే రోజులలో మాటలు కంటె భిన్నంగా వున్నాయి. రూపంలోకూడ ఎంతో మార్పు వచ్చింది.

"నీలోఅసలు మార్పురాలేదే!" రమేష్ నన్నుఅడిగాడు.

నాలో ఎట్లా మార్పు వస్తుంది? పైపై ఆదాయం లేని టీచరు ఉద్యోగం చేస్తున్నాను. ఎందుకో వాడితో ఎక్కువ మాట్లాడలేక పోతున్నాను. వాడి Maintainance బట్టి తెలుసుకోవచ్చు. వాడెంత 'నిజాయతీ' గా వున్నాడో! ఆ రోజు రాత్రికి వుండిపొమ్మని ఆ దంపతులు మమ్మల్ని ఎంతగానో బ్రతిమాలారు. నా భార్యకు, పిల్లలకు అక్కడ ఉండాలనే వుంది. కాని నాకు ఒక్క నిమిషంకూడ ఉండబుద్ధి కాలేదు. వాడి 'నిజాయతీ' తో సంపాదించిన తిండి తినాలని లేదు. ఇంకోసారి తప్పకుండా వస్తామని చెప్పి యింటికి వచ్చేశాము. అపుడు మా నాన్నగారు అంటూండే మాటలు జ్ఞాపకమొచ్చాయి - "ఆదర్శాలను ప్రక్కకు నెడితే ఎంతకైనా ఎదగొచ్చని".